క్లుప్తంగా

అలరించిన సూపర్ స్టార్ కృష్ణ సినీ హిట్ సాంగ్స్



పాత గుంటూరు: శ్రీ శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో సూపర్ స్టార్ కృష్ణ సూపర్ హిట్స్ పేరుతో నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. కృష్ణ నటించిన చిత్రాలలోని పలు పాటల్ని గాయకులు మేకల పురుషోత్తమ ప్రసాద్, చీకటి రవికాంత్, పత్రి గాయత్రి, అత్తోట సౌజన్య, చింతా రజిని శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమాన్ని కళావేదిక సభ్యులు ఎన్నుబర్ల బ్రహ్మం, సిరిగిరి గణేష్, కమలికంటి వలి, శెట్టి థామస్, పాగళ్ల మోహనరావు, దొప్పలపూడి శ్రీనివాసరావు, తూములూరి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, బాబురావు పర్యవేక్షించారు.

మహిళలకు ఫిట్‌నెస్‌పై ఉచిత శిక్షణ

గుంటూరు వెస్ట్: వివాహం ముందు, తర్వాత మహిళల నిర్లక్ష్యంగా ఉండటం వల్ల అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయని జాయ్ అండ్ షైన్ వెల్‌నెస్ చీఫ్ కోచ్ జ్యోతి శ్యామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య చిట్కాలు, వ్యాయామం నేర్చుకుంటే అనేక సమస్యల నుంచి సులభంగా బయటపడవచ్చని పేర్కొన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో 30 రోజులపాటు ఉచితంగా మహిళలకు ఫిట్‌నెస్ ట్రైనింగ్ ఇస్తామని తెలియజేశారు. ఆధునిక విధానాలతో సులభ మార్గాలతో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు బ్రాడీపేటలోని తమ సంస్థలో లేదా 99596 51412 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన యోగా మహోత్సవ్



గుంటూరు వెస్ట్: హార్ట్‌ఫుల్ సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న యోగా మహోత్సవ్ ఆదివారంతో ముగిసింది. శిక్షకుడు రఘురామ్ సారథ్యంలో 13 సంవత్సరాల పిల్లలకు బ్రైటర్ మైండ్ అనే అంశంపై పలు సూచనలు చేశారు. రామచంద్ర మిషన్ కోఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ యోగా అద్భుతమైన ప్రక్రియన్నారు. వయస్సు, లింగ భేదం లేకుండా ఎవరైనా సాధన చేసి అద్భుత ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో సుంకర రామకోటేశ్వరరావు, దుర్గారావు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.


నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

రేపు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి రాక

పాత గుంటూరు: శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి, జగద్గురువులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి మంగళవారం సాయంత్రం ఏటీ అగ్రహారం లోని శ్రీ శంకర గాయత్రీ దత్త సాయి సత్య దేవ మందిరానికి విచ్చేస్తున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. మందిరంలో అనుగ్రహ భాషణం చేస్తారని పేర్కొంది. భక్తులంతా పాల్గొనాలని కమిటీ కోరింది.

కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్‌గా శ్రీహరిరెడ్డి



పాత గుంటూరు: గుంటూరుకు చెందిన ప్రముఖ ఆడిటర్ టి. శ్రీహరిరెడ్డి ప్రకాశం జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాయపాటి మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్‌లో శ్రీహరిరెడ్డికి అభినందన సభ నిర్వహించారు. సభలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, మిత్రమండలి కార్యదర్శి జె. పార్థసారథి, డాక్టర్ రాజా సిద్ధార్థ, కార్పొరేటర్ కె. కోటేశ్వరరావు, మురళి శ్రీనివాస్ పాల్గొని శ్రీహరిరెడ్డిని సన్మానించి, అభినందించారు.

ఎన్నాళ్లీ మరణ యాతన ?

- మృతుల్ని సమాధి చేసేందుకు దళిత క్రైస్తవులకు చోటు కరువు
- 250 సంవత్సరాల కిందట కేటాయించిన స్థలాలు పూర్తిగా సమాధులతో నిండిపోయిన వైనం
- చనిపోతే స్థలం కోసం వెతుకులాట



సమాధులతో కిక్కిరిసిన ఆనందపేట క్రైస్తవ శ్మశానవాటిక

నెహ్రూనగర్: క్రైస్తవులు జననం ఎంత పరిశుద్ధంగా భావిస్తారో...మరణం కూడా అంతే పరిశుద్ధంగా భావిస్తారు. చనిపోయిన విశ్వాసుల్ని దేవుడు మరలా సజీవులుగా సమాధుల్లోంచి లేపుకుని పరలోకానికి తీసుకువెళతారని దృఢ సంకల్పంతో ఉంటారు. అటువంటి ప్రత్యేకత సమాధులకు ఉంది. కాని నగరంలో క్రైస్తవులు చనిపోతే వారిని ఖననం చేసేందుకు తగిన స్థలం లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు.

15 సంవత్సరాల కిందటే నిండిపోయిన శ్మశానవాటిక

నగరంలో లూథరన్, బాప్టిస్ట్ మిషన్ల పరిధిలో అత్యధిక సంఖ్యలో దళిత క్రైస్తవులు ఉన్నారు. ఆర్‌సీఎం, సీఎస్ఐ ఇతర డినామినేషన్లు కలుపుకుని సుమారు నాలుగు లక్షలకు పైచిలుకు ఉంటారు. 250 సంవత్సరాల కిందట కేటాయించిన సమాధులు పూర్తిగా నిండిపోయాయి. గత 15 సంవత్సరాల నుంచి మృతదేహాన్ని సమాధి చేసేందుకు స్థలం కరువైంది. సమాధుల మీద సమాధులు ఏర్పాటు చేసుకుంటున్నారు. కోవిడ్ సమయంలో అధిక సంఖ్యలో చనిపోవడంతో ఒక్క సమాధిలోనే రెండు నుంచి నాలుగు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం తుఫాన్ నగర్‌లో దళిత క్రైస్తవులు సమాధి చేసుకుంటున్నారు. అది కూడా నిండిపోయే పరిస్థితిలో ఉంది. భవిష్యత్తులో ఇదే పరిస్థితి నెలకొంటే సమాధి కార్యక్రమం మరింత గడ్డు సమస్యగా మారే అవకాశం ఉంది.

నిరుపయోగంగా గోరంట్లలోని 11 ఎకరాల స్థలం

కొద్ది సంవత్సరాల కిందట గోరంట్ల సమీపంలో సుమారు 11 ఎకరాలను 2013లో అప్పటి కలెక్టర్ కేటాయించి దాని చుట్టూ ప్రహరీ కట్టించారు. అయితే, కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో అది కూడా నిరుపయోగంగా మారింది. గత నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ దళిత క్రైస్తవులకు శ్మశాన వాటికలు కేటాయించాలని ప్రస్తావించారు. దీనిపై అధికారులు తగిన చొరవ తీసుకుని శ్మశానవాటికల్ని కేటాయించాలని అధికారుల్ని ఆయన కోరినా ఫలితం లేకపోయింది.

మృతుల్ని ఖననం చేయడానికి అవస్థలు



ప్రస్తుతం నగరంలోని అన్ని సమాధుల తోటలు పూర్తిగా నిండిపోయాయి. కొంచెం స్థలం కూడా లేని పరిస్థితి. కోవిడ్ సమయంలో మృతదేహాల్ని పూడ్చడానికి ఎన్నో ఇబ్బందుల్ని దళిత క్రైస్తవులు ఎదుర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నగరంలోని నాలుగు మూలల్లో సమాధుల తోటలు ఏర్పాటు చేయాలి.

–డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు, ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్(ఐక్య) అధ్యక్షుడు

అధికారులు చొరవ తీసుకుని స్థలం కేటాయించాలి



గుంటూరు నగరంలో దళిత క్రైస్తవులు చనిపోతే పూడ్చడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఉన్నతాధికారులు చొరవ తీసుకుని మరన్ని శ్మశాన వాటికలు నిర్మించాలి. ప్రస్తుత శ్మశానవాటికల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పాటు మౌలిక వసతులు కల్పించాలి.

–మద్దు ప్రేమ జ్యోతి బాబు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు

కార్యకర్తలే బలం.. ప్రజలే బలగం

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి తదితరులు

పట్నంబజారు: జగనన్నే మా భవిష్యత్తు అని రాష్ట్ర ప్రజలంతా ముక్త కంఠంతో నినదిస్తున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఊరూరా ఉద్యమమై సాగుతున్న తీరు, సర్వత్రా స్వాగతిస్తున్న జన హోరు అందుకు నిదర్శనమన్నారు. మా నమ్మకం నువ్వే జగన్.. కార్యక్రమం ఆదివారం 39వ డివిజన్ గుజ్జనగుండ్ల, 30వ డివిజన్ ఏటీ అగ్రహారంలో నిర్వహించారు. కార్పొరేటర్లు షేక్ జుమ్మాబీ, అచ్చాల వెంకటరెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయా ఇంటి యజమానుల అనుమతితో డోర్ స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రాజకీయ పక్షాల టార్గెట్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కార్యకర్తలే బలంగా... ప్రజలే బలగంగా... ముందుకు సాగుతున్న ఆయన్ను ఒంటరిగా ఎదుర్కొనే సత్తా ఏ ఒక్క పార్టీకి లేదని చెప్పారు. అందుకే అన్ని పార్టీలు కలిసి గ్రూపులు కడుతూ గుంపుగా గూడుపుఠాని చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రజలకు మంచి చేసినందుకే వారికి సీఎం జగన్‌పై కక్ష అనే వాస్తవాన్ని ప్రజలంతా గుర్తెరగాలని ఆయన సూచించారు. అవినీతి రహిత, అభివృద్ధి, సంక్షేమ సహిత పాలన అందిస్తుంటే ఓర్చుకోలేకే విషం చిమ్ముతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం ఇచ్చిన హామీలు అమలు చేసిన చరిత్రే లేదని స్పష్టం చేశారు. టీడీపీ అయితే అధికారంలోకి రాగానే తమ పార్టీ వెబ్‌సైట్ నుంచి ఏకంగా ఎన్నికల మేనిఫెస్టోనే ఎత్తి పారేసిందని ఎద్దేవా చేశారు. అసలు 98 శాతం హామీలు అమలు చేసిన ప్రభుత్వం దేశంలో ఎక్కడైనా ఉందా? అని సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవే కాక చెప్పని అనేక కార్యక్రమాలు చేపట్టిన ఘనత ఒక్క సీఎం జగన్‌కు మాత్రమే దక్కుతుందని కొనియాడారు. అందుకే తాము ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామని, ప్రజలు కూడా మా నమ్మకం నువ్వే జగనన్న అని నినదిస్తున్నారని తెలిపారు. మళ్లీ మళ్లీ ఈ రాష్ట్రానికి జగనన్నే ముఖ్యమంత్రి కావాలని స్వయంగా ప్రజలే కోరుకుంటున్న వాతావరణం సర్వత్రా నెలకొని ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు మార్కెట్ బాబు, ఉడతా కృష్ణ, ఏవీఎల్ మధు, పిల్లుట్ల మోహనరావు, పార్టీ డివిజన్ అధ్యక్షుడు షఫి, అజీజ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), స్థానిక సచివాలయ కన్వీనర్లు షేక్ బాబు, మున్నా, పోగుల వెంకటేశ్వర్లు, షేక్ సత్తార్, సూరసారి వెంకటరెడ్డి, ఈపూరి వనజాక్షి పాల్గొన్నారు.

23న సినీ పాటల పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాదరావు, వీరాంజనేయులు తదితరులు

పాత గుంటూరు: భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శతజయంతి పురస్కరించుకుని అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 22, 23న సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు తెలిపారు. భారత్‌పేట కార్యాలయంలో ఆదివారం కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రసాదరావు మాట్లాడుతూ 22న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకంలోని ఘట్టాల ప్రదర్శన, 23న ఉదయం 10 గంటల నుంచి రాష్ట్రస్థాయి సినీ పాటల పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 7 వేలు, ద్వితీయ రూ. 5 వేలు, తృతీయ రూ. 3 వేలతో పాటు తొమ్మిది మంది విజేతలకు ప్రత్యేక నగదు బహుమతులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 9440109795 నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సేవాసదన్ అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, యర్రగోపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాటలను ఆలపిస్తున్న గాయకులు

పాత గుంటూరు: రాజాగారితోటలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కళాంజలి వ్యవస్థాపకుడు తొట్టెంపూడి రమేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఎన్టీఆర్ గానామృతం పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. ఎన్టీఆర్ సినిమాలోని పాటల్ని గాయకులు రమేష్, స్టాలిన్, రసూల్‌బాబు, శివలీల, భారతి ఆలపించారు. ఎం.ఎస్. బాబు సంగీతాన్ని అందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, కళారంగంలో బి. వేదయ్యకు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందించి సన్మానించారు. కార్యక్రమంలో చందు సాంబశివరావు, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మిరియాల ప్రసాదరావు పాల్గొన్నారు. ఎస్‌కె. ఇస్మాయిల్, పెళ్లూరి కృష్ణారావు పర్యవేక్షించారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



పట్నంబజార్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని తూర్పు నియోజకవర్గంలోని మాయాబజార్‌లో వ్యాపారస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఆదివారం నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షలు చేసే ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత షేక్ షౌకత్, వ్యాపారులు, పార్టీ నేతలు షేక్ నాగూరా, షేక్ యాసిన్, నగర మేహతాబ్, షేక్ బాజీ పాల్గొన్నారు.

బీజేపీ నేత ఆంజనేయులుకు ఘన నివాళి

పాత గుంటూరు: సాలిపేటలోని నందూరి కోటేశ్వరరావు కల్యాణ మండపంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అమ్మిశెట్టి ఆంజనేయులు సంతాప సభ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు, జూపూడి రంగరాజు, జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ, పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు పాల్గొని ఆంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పూలే విగ్రహాల ఆవిష్కరణ సన్నాహక సదస్సు వాయిదా

నెహ్రూనగర్: నగరంలో ఈ నెల 10న నిర్వహించ తలపెట్టిన పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ సన్నాహక సదస్సు అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు పూలే విగ్రహాల సాధన సమితి కన్వీనర్ వై. కోటేశ్వరరావు(వైకె) తెలిపారు. ఆదివారం నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11న జ్యోతిరావుపూలే 196వ జయంతి సందర్భంగా మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న పూలే విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. పూలే దంపతుల విగ్రహ సాధనకు తమ వాణిని వినిపించాలన్నారు. హిందూ కాలేజీ కూడలిలో ఐలాండ్ నిర్మించి పూలే విగ్రహాన్ని అక్కడికి తరలించి పక్కనే సావిత్రీబాయి పూలే విగ్రహాన్ని కూడా ఆవిష్కరించాలనే లక్ష్యంతో సాధన సమితి కృషి చేస్తోందని వైకే వివరించారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

గార్లపాడు(కాకుమాను): జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గార్లపాడులో ఆదివారం రాత్రి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల్ని అఖండ మెజార్టీతో గెలిపించుకునేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధం

పెదనందిపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రేకుల షెడ్డు దగ్ధం అయిన ఘటన పెదనందిపాడులో చోటుచేసుకుంది. రజక కాలనీలో ఉప్పుకట్ల రవి ఇంటిలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రూ. 70 వేల నగదుతో పాటు మూడు సవర్ల బంగారం, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. ఘటనా స్థలికి పెదనందిపాడు పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.

వృద్ధురాలు నేత్రదానం



పెదనందిపాడు: తాను చనిపోయినా కళ్లతో మరొకరు చూపు పొందాలనే సదాశయంతో ఓ వృద్ధురాలు నేత్రదానం చేశారు. పెదనందిపాడు గ్రామానికి చెందిన యెలిశెట్టి భాగ్యమ్మ(80) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో మరణించారు. భాగ్యమ్మ కోరిక మేరకు శంకర్ నేత్రాలయం వారికి కుటుంబసభ్యులు సమాచారం అందించారు. వైద్యులు వి. సోనాలి వృద్ధురాలి కళ్లను సేకరించి నేత్రాలయకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో ఏసు పునరుత్థాన పండుగ

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఫాదర్లు



విద్యానగర్‌లో సహాయమాత చర్చిలో సందేశమిస్తున్న పాస్టర్లు



సహాయమాత చర్చిలో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసులు



సహాయమాత చర్చిలో ఏసు పునరుత్థాన దృశ్యం



లాడ్జి సెంటర్ నార్త్ ప్యారీస్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



వెస్ట్ ప్యారీస్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవ విశ్వాసకులు



మజ్జిగ పంపిణీ చేస్తున్న డిసెబుల్డ్, సీనియర్ సిటిజన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్

పాత గుంటూరు/ పట్నం బజారు: ఏసు క్రీస్తు పునరుత్థాన దినోత్సవమైన ఈస్టర్ పండుగను క్రైస్తవ విశ్వాసులు విద్యానగర్‌లోని సహాయమాత దేవాలయంలో ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

- లాడ్జి సెంటర్‌లోని సెయింట్ మాథ్యూస్ నార్త్ ప్యారిష్ చర్చిలో బిషప్ రైట్ రెవరెండ్ ఎస్. జోహాన్ బాబూరావు ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా పాల్గొన్నారు. అదనపు పాస్టర్లు రెవరెండ్ ఎం. రత్నపాల్, రెవరెండ్ ఎస్.ఎస్. జేమ్స్ సుధీర్, రెవరెండ్ న్యూటన్ నెమలికంటి, రెవరెండ్ ఎమ్. శామ్యూల్ జాన్, రెవరెండ్ పురుషోత్తమ్ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కోశాధికారి జాలాది చిత్తరంజన్, అడహక్ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
- మార్కెట్ సెంటర్‌లోని వెస్ట్ ప్యారిష్ చర్చిలో పాస్టర్ జి. సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. కె. ఉష, వి. మేరి సుధారాణి, కొండస్వాతి బైబిల్ సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.
- పాత బస్టాండ్ సెంటర్‌లోని ఈస్ట్ ప్యారిష్ చర్చి, కన్నావారితోటలోని తెలుగు బాప్టిస్టు సంఘం, నగరంలో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విశేష సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.
- విద్యానగర్‌లోని సహాయమాత చర్చిలో జరిగిన ఈస్టర్ వేడుకలలో విచారణ గురువు ఫాదర్ గువ్వల బాలరాజు, ఫాదర్ లింగారెడ్డి లూర్దు మర్రెడ్డి, సహాయ గురువు లూర్దురెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పునరుత్థానం ద్వారా ఏసు క్రీస్తు లోకంలో వెలుగు నింపారనే సందేశానికి నిదర్శనంగా ప్రత్యేకంగా ఈస్టర్ క్రొవొత్తిని ఆశీర్వదించి వెలిగించారు. పునరుత్థానం ద్వారా ఏసుక్రీస్తు ఈ లోకానికి అందించిన సందేశాన్ని క్రైస్తవ విశ్వాసులకు వివరించారు. దేవాలయ ప్రాంగణంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో వేలాదిగా క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు. పవిత్రతకు ప్రతీకగా చిన్నారులు తెల్లని వస్త్రాలు ధరించి ప్రార్థనల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈస్టర్‌కు ప్రతీకగా నిలిచిన పునరుత్థాన దృశ్యాలు

చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమాధిలో నుంచి ఏసు క్రీస్తు పునరుత్థాన ఘటనలు ఈస్టర్ పండుగకు ప్రతీకగా నిలిచాయి. భూకంపం, పెద్ద శబ్దాలు సంభవిస్తుండగా ఏసుక్రీస్తు సమాధి నుంచి పైకిలేచే సన్నివేశాన్ని క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో వీక్షించి ప్రార్థనలు చేశారు.

మజ్జిగ పంపిణీ

నెహ్రూనగర్: ఈస్టర్ పండుగను పురస్కరించుకుని శారదా కాలనీ 25వ లైనులో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ నూనె వెంకట్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిసెబుల్డ్, సీనియర్ సిటిజన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముంతాజ్ పఠాన్ హాజరయ్యారు. 53వ డివిజన్ కార్పొరేటర్ దూపాటి వంశీ, వైఎస్సార్ సీపీ నాయకులు గనిక ఝాన్సీ, అనిల్, లక్ష్మి పాల్గొన్నారు.

ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని ఏసుక్రీస్తు చాటిన పర్వదినం

- ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

చర్చిల్లో ఎమ్మెల్యే ముస్తఫా ప్రార్థనలు



పట్నంబజారు: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్‌ముస్తఫా పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందూ కళాశాల కూడలి సమీపంలోని వెస్ట్ ప్యారీష్, లాడ్జి సెంటర్‌లోని నార్త్ ప్యారీష్, మాయాబజారులోని ఈస్ట్ ప్యారీష్ చర్చిల్లో పాస్టర్ల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, రాణాప్రతాప్ పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసరాల కిట్ల పంపిణీ



సరుకుల కిట్‌ను వృద్ధునికి అందిస్తున్న సమితి సభ్యులు

నగరంపాలెం: ఆసరా లేని వృద్ధులు, దివ్యాంగుల్ని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. కొత్తపేట జానీ కాంప్లెక్ ఆవరణలోని సమితి కార్యాలయంలో నెలనెలా ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీలో భాగంగా ఆదివారం యాభై మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతుగా అన్నార్తులకు సేవలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పోలేపల్లి సుబ్రహ్మణ్యం, మాదాల ప్రకాష్, ఎస్.వి.రమణ, మురళీసాయి, పలకలూరి శివరావు, వి.త్రినాధ్ పాల్గొన్నారు.

నటుడు మన్నవ బాలయ్యకు ఘన నివాళి



బాలయ్య చిత్రపటానికి నివాళులర్పించిన జాస్తి వీరాంజనేయులు తదితరులు

పాత గుంటూరు: ప్రముఖ సినీ నటుడు మన్నవ బాలయ్య ప్రథమ వర్ధంతిని ఆయన స్వగ్రామమైన చావపాడులో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన బాలయ్య తన నటనతో ప్రేక్షకుల మన్ననల్ని పొందారని కొనియాడారు. భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, బాలయ్య కుటుంబ సభ్యులు మన్నవ గీత, మన్నవ మిథున్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మన్నవ చంద్రశేఖరరావు, సుందరరావు, శ్రీహరిబాబు, శివప్రసాద్, నెలకుదిటి వెంకటయ్య, వలివేటి ధర్మారావు, మన్నవ మధుసూదన్, మన్నవ చిన గురవయ్య చౌదరి, జమ్ముల నరేంద్ర, చిలకా ఆనందరావు తదితరులు నివాళులు అర్పించారు.